

## నేడు ఏపీ పీజీ సెట్ కన్వీనర్ ఆఫీసు ముట్టడి

**ప్రజాశక్తి - క్యాంపస్**

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీ పీజీ సెట్ 2025 పరీక్షల కన్వీనర్ కేంద్రాన్ని శుక్రవారం ముట్టడిస్తామని విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరించారు. వర్సిటీ ఇంచార్జి విసి, రిజిస్ట్రార్ లు వచ్చి ఏపి పీజీ సెట్ కన్వీనర్ బ్యానర్ చింపకుండా ఆపుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాలు అన్నపూర్ణ క్యాంటీన్ దగ్గర ఐక్యతను చాటి హెచ్చరించారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ వేదికగా గత 20 రోజుల నుంచి వినూత్నంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో చలపతి, సుందర రాజు, అశోకు, ఆశ, తిరుమలేశు,లోకేష్, వినోద్, చంద్ర నాయక్, శివ నాయక్ పాల్గొన్నారు.

# 'ఓటేరు' కబ్జాదారులపై కేసు నమోదు చేయాలి

చెరువు కబ్జాను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

## చెరువు ఆక్రమణలను పరిశీలించిన సిపిఎం

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

తిరుపతి రూరల్ పరిధిలో ఉండే ఓటేరు చెరువు ఆక్రమణకు గురవుతుందని, దాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఓటేరు చెరువు ఆక్రమణలను సిపిఎం నాయకులు గురువారం పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి విషయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబర్ 370లో 6.76 ఎకరాలు, 376లో 12.40 ఎకరాలు, 377లో 17.18 ఎకరాలు మొత్తంగా 36.34 ఎకరాల భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం అదంతా చెరువు భూమి. తరతరాలుగా వందలాది ఎకరాల భూములకు సాగునీరు అందించిన ఓటేరు చెరువు ప్రస్తుతం పరుల చేతికి చేరి ప్లాట్లుగా మారుస్తున్నారు. దాదాపు రూ.1080 కోట్ల విలువైన 36 ఎకరాల చెరువు భూమిని భూ ఆక్రమణ దారులకు అడ్డగోలుగా దోచి పెట్టడానికి తహశీల్దార్ స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు ఏకమయ్యారని విమర్శించారు. బ్రిటీష్ కాలం నుంచి రెవెన్యూ రికార్డుల్లో అది చెరువు అని ఉంటే, కొంతమంది అధికారులు చెరువు కాదని పట్టాలిచ్చేసి యథేచ్ఛగా ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారని విమర్శించారు. గతంలో సిపిఎం ఈ అక్రమాలను వెలుగులోకి తెచ్చిందని గుర్తు చేశారు. గత కొంతకాలంగా చెరువును ఎర్రమట్టితో పూడ్చారని, కొంతమంది అధికారులు సస్పెన్షన్‌కు గురైనా ఏమాత్రం లెక్కచేయకుండా భూమిని చదును చేయిస్తున్నారన్నారు. తక్షణం చెరువును కాపాడాలని, కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఓటేరు చెరువును పరిశీలించిన వారిలో సిపిఎం నాయకులు జి.బాలసుబ్రమణ్యం, టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, కె.వేణుగోపాల్, పి.హేమలత, కె.సుమన్, ఎం.నరేంద్ర, పి.బుజ్జి,

## బాలాయపల్లి 'ప్రజాశక్తి' విలేకరికి బెదిరింపులు

**ప్రజాశక్తి - బాలయపల్లి**

బాలాయపల్లి మండలంలో ప్రజా సమస్యలపై వార్తలు రాస్తున్న 'ప్రజాశక్తి' విలేకరిని బెదిరించిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గురువారం ఉదయం కేసు నమోదు చేయాలని ఎస్ఐ దృష్టికి విలేకరి శ్రీను తీసుకెళ్లినా పట్టించుకోలేదు. గురువారం సైతం బుధవారం అర్ధరాత్రి వచ్చి దాడికి పాల్పడినవారే మరోమారు విలేకరిని బెదిరించడమే గాకుండా, విలేకరి భార్యపై దౌర్జన్యానికి పాల్పడటాన్ని సహచర జర్నలిస్టులు యాకూబ్ బాష (ప్రజాశక్తి), జగ్గయ్య (విశాలాంధ్ర), కిషోర్ (డిడి న్యూస్), శ్రీను (ఐన్యూస్), జి.శ్రీనివాసులు (సాక్షి) ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే జర్నలిస్టు సంఘాలన్నీ విలేకరికి అండగా ఉంటాయని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు వళిగళం గోపి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సమస్యలను ప్రశ్నిస్తే దాడులకు పాల్పడటం ఏంటని మేనేజర్ సిఎస్ ప్రసాద్ ప్రశ్నించారు. 'అంగన్‌వాడీ స్కూల్లో సమస్యలపై' వార్తలు రాస్తే విలేకరి కుటుంబంపై దాడికి పాల్పడటాన్ని ఖండించారు.

## రాజకీయ వేధింపులకు దళిత ఆర్పీ ఆత్మహత్యాయత్నం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

అధికార పార్టీ నేతల వేధింపులు తాళలేక శ్రీకాళహస్తి పట్టణ మెప్మా విభాగం పరిధిలో పనిచేసే ఓ మహిళా దళిత ఆర్పీ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బంధువులు గుర్తించి ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి కథనం ప్రకారం..శ్రీకాళహస్తి పట్టణంలోని 9వ వార్డులో పార్వతీదేవి మహిళా సమాఖ్య ఆర్పీగా సరళమ్మ గత ఆరేళ్లుగా సేవలందిస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక నేతలు ఆమెను తొలగించాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఆమెకు వ్యతిరేకంగా వార్డు మహిళా సభ్యుల వద్ద అబద్ధపు సంతకాలు చేయించి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఏ తప్పు చేయకున్నా, సంఘాలను సమగ్రంగా నడుపుతున్నా, తప్పుడు ఫిర్యాదులు చేసి తన ప్రమేయం లేకుండానే మహిళా సమాఖ్యను గురువారం వార్డులో నడపడంతో తీవ్ర మనస్థాపానికి గురైన సరళమ్మ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది.

తాను ఆత్మహత్యాత్నం చేసుకోవడానికి గల కారణాలను సూసైడ్ లేఖలో రాసింది. 9వ వార్డు టీడీపీ నేతలు సుప్రజ, పుష్ప, మెప్మా సీఎంఎం జయరాం కారణంగా పేర్కొంది. ఈ సందర్భంగా తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది.

**సిఐటియు, ఏఐటీయూసీ నేతల పరామర్శ**

ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దళిత ఆర్పీ సరళమ్మను గురువారం సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పెనగడం గురవయ్య, జనమాల గురవయ్య పరామర్శించారు. కూటమి ప్రభుత్వంలో చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయనీ, దళితులు ఉద్యోగాలు, ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుని సరళమ్మకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

కరెంటు షాక్‌తో ఓ గిరిజన రైతు మృతి చెందిన దుర్ఘటన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం కాలంపల్లి గిరిజన కాలనీలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి పోతే.. గ్రామానికి చెందిన వడమంజి చెంగయ్య వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్ళాడు. మధ్యాహ్నం అయినా చెంగయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించాడు. పొలానికి నీళ్లు పట్టేందుకు వెళ్లి చెంగయ్య కరెంట్ షాక్ తో మృతి చెందాడని కొందరు చెబుతుండగా, ఓ రైతు అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి మరణించాడని ఇంకొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సమానత్వంతోనే సాధికారత : ఐద్వా

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

'స్త్రీ సమానత్వంతోనే సాధికారత సాధ్యమవుతుందని, దీనికి బాల్యం నుంచే బీజం పడాలి' అని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాయిలక్ష్మి అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో గాయత్రి డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదస్సు ముందస్తుగా గురువారం జరిగింది. కుటుంబంలోనూ, విద్యాసంస్థల్లోనూ, సమాజంలోనూ లింగవివక్ష బాల్యం నుంచే లేకుండా చూడాలన్నారు. యువత శాస్త్రీయ అవగాహనతో మెలగాలని, భవిష్యత్ తరాలను మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎం.జయంతి, సోషల్ వర్కర్ ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఆర్థికంగా స్థిరపడితేనే స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలరని అన్నారు. అపుడే స్త్రీ సాధికారత సాధ్యమవుతుందన్నారు.

**మహనీయుల అడుగుజాడలే సోపానాలు**

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారంటే మహనీయుల అడుగుజాడలే కారణమని తుడా కార్యదర్శి డాక్టర్ జి. వెంకటనారాయణ అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో సమాజ సేవ ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో మహిళలకు ఘన సన్మానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటనారాయణ మాట్లాడుతూ మహాత్మా గాంధీ, కందుకూరి వీరేశలింగం, రాజారాం మోహన్ రాయ్, మహాత్మ జ్యోతిరావు పూలే వంటి మహనీయులు మహిళల అభివృద్ధి కోసం చేసిన సంస్కరణ కార్యక్రమాలే నేడు సమాజంలో మహిళలు ప్రతి రంగంలో రాణించడానికి అవకాశం కల్పించబడిందన్నారు. అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇలా 30 మంది మహిళలను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా కళావేదిక సంస్థ నిర్వాహకులు అరవ జయపాల్, వైద్యురాలు రోజారమణి పాల్గొన్నారు.

**బాలల లైంగిక వేధింపులపై అవగాహన**

**తిరుపతి సిటీ :** తిరుపతిలోని రుయా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని పీడియాట్రిక్స్ విభాగంలో బాలల లైంగిక వేధింపుల నివారణ, అవగాహన నైపుణ్యాలపై కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎంహెచ్ఓ డాక్టర్ బాలాజీ నాయక్ మాట్లాడుతూ శిక్షణలో బాలల లైంగిక వేధింపులను గుర్తించడం, వాటిని నివారించడం, బాధితులకు సహాయం అందించడం వంటి అంశాలపై విస్తతంగా చర్చించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ పద్మావతి, డిప్యూటీ డిఈఓ బాలాజీ, జిల్లా వత్తి విద్యాశాఖాధికారి విశ్వనాథ్ పాల్గొన్నారు.

## ఎస్వీయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పద్మావతి

**ప్రజాశక్తి - క్యాంపస్**

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వర్సిటీ రసాయనశాస్త్ర విభాగ ఆచార్యులు వి.పద్మావతిని నియమించారు. ఆమె గురువారం గత ప్రిన్సిపాల్ ఆచార్య కేటి రామకష్ణారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను ఆచార్యులు నాగజ్యోతి, రుద్రమదేవి, సుజాత, డా.పాకనాటి హరికష్ణ శుభాకాంక్షలు తెలిపారు.ఆమె 31 సంవత్సరాల బోధన, పరిశోధన అనుభవాన్ని కలిగి ఉన్నారు. ఆమె మార్గదర్శకత్వంలో 35 పిహెచ్‌డిలు, 13 ఎంఫిల్ డిగ్రీలను అందించారు. 11 జాతీయ అంతర్జాతీయ సంస్థల్లో ప్రాజెక్టులను నిర్వహించారు. ముఖ్యంగా మెటెరీసైక్లిక్ కెమిస్ట్రీ, ఫార్మకాలజీ యొక్క బహుళ క్రియాత్మక హెటెరో – అరోమాటిక్ట్ సుదీర్ఘ అనుభవం ఉంది.

## అర్హులైన రైతులందరికీ న్యాయం చేస్తాం : సబ్‌కలెక్టర్

**ప్రజాశక్తి -కోట**

అర్హులైన రైతులందరికీ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని కొత్తపట్నం పంచాయతీ రెవిన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు నష్టపరిహారం చెల్లించుట కొరకు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్, స్థానిక తాహాసిల్దార్ కటారి.జయ జయ రావు ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఎకరాకు ఎనిమిది లక్షలు నష్టపరిహారం చెల్లిస్తామని వెల్లడించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి ఆధారాలతో సహా సమర్పిస్తే పున్ణపరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నం పంచాయతీ సర్పంచ్ ఈదూరు. తిరుపాలయ్య, ఎంపీటీసీ శేషాద్రి, తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ భరత్ రెడ్డి, నెల్లూరు ఏపీఐఐసీ డిప్యూటీ మేనేజర్ శేఖర్ రెడ్డి, కోట తాహాసిల్దార్ కటారి జయ జయ రావు, మండల సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ మధులత పాల్గొన్నారు.

## 11 నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

**తిరుపతి టౌన్ :** సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని 11న విజయవాడ కేంద్రంలో జరగనున్న నిరసన దీక్షను జయప్రదం చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షులు గండికోట నాగవెంకటేష్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం కోశాధికారి ఈ. శివకుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం భోజన విరామ సమయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన తెలిపారు. మినిమం టైంస్కేలు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అనేకమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ దీక్ష చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో షేక్ హసీనా, వేణుగోపాల, ధనపాల్; నవీన్‌కుమార్, ఆశాలత, రమాదేవి, రూపావతి పాల్గొన్నారు.

## 10న అంగన్‌వాడీల 'చలో విజయవాడ'

**తిరుపతి టౌన్ :** అంగన్‌వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారానికి, వేతనాల పెంపుకు 10వ తేదీన చేపట్టిన 'చలో విజయవాడ, మహాధర్నా' కార్యక్రమానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజుల పాటు అంగన్‌వాడీ సిబ్బంది ఆంధ్రరాష్ట్రంలోని యావత్ స్కూళ్లను మూసేసి సమ్మె చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో చర్చల సందర్భంగా ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు చేసిందని, వాటిని జీవోలుగా నేటికీ విడుదల చేయకపోవడం సమంజసం కాదన్నారు. వైసిపి కంటే గొప్ప నిర్ణయాలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు.

ఆర్‌డిఓ కిరణ్మయికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

## ప్రభుత్వ భూములకు పరిహారం చెల్లించొద్దు : సిపిఎం

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్**

సత్యవేడు మండలం ఇరుగుళం కొల్లడం, పెద్దఈటిపాకం, చిన్న ఈటిపాకం గ్రామాల్లో పారిశ్రామిక అవసరాల కోసం చేస్తున్న భూసేకరణలో ఒరిజినల్ పట్టాలు కలిగిన రైతులకు మాత్రమే పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములకు సంబంధం లేని వ్యక్తుల పేర్లను నోటిఫికేషన్‌లో చేర్చి అక్రమంగా డబ్బులు పొందాలని చూస్తున్న వారికి పరిహారం చెల్లించొద్దని పేర్కొన్నారు. ఈ మేరకు చిన్నఏటిపాకం గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆర్డీవోకు అర్జీని సమర్పించారు. ఈ విషయమై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ ఇరుగుళం రెవెన్యూలో సర్వే నంబర్ 162/2లో 3 ఎకరాల 82 సెంట్లు ప్రభుత్వ భూమికి, చిన్న ఈటిపాకం రెవెన్యూలో సర్వే నంబర్ 3బి 1లో 3 ఎకరాల 88 సెంట్లు ప్రభుత్వ భూములకు పరిహారం పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఆర్డీవో కిరణ్మయి స్పందిస్తూ సమగ్ర విచారణ జరిపించి అనర్హులకు పరిహారం ఇవ్వకుండా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు మండల కార్యదర్శి మెలుగు రమేష్, రైతుసంఘం నాయకులు జయ రామచంద్రారెడ్డి, మునస్వామి, కృష్ణయ్య పాల్గొన్నారు.

## సరఫరా గొలుసు స్థిరత్వంలో శ్రీసిటీ కీలక పాత్ర

**ప్రజాశక్తి- వరదయ్యపాలెం**

జపాన్ కంపెనీల సరఫరా గొలుసు స్థిరత్వ ప్రోత్సాహక కార్యక్రమంలో శ్రీసిటీ కీలక పాత్ర పోషిస్తుందని మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. 'భవిష్యత్ కోసం సుస్థిర సరఫరా గొలుసు వ్యవస్థను నిర్మించడం' ప్లీనరీ సెషన్ న్యూఢిల్లీలోని ఫిక్కీ కార్యాలయంలో 48వ ఇండియా–జపాన్ బిజినెస్ కోఆపరేషన్ కమిటీ ఉమ్మడి సమావేశంలో రవీంద్ర సన్నారెడ్డి ప్రసంగించారు. ఈ సమావేశానికి జపాన్ నుంచి ఉన్నతస్థాయి పారిశ్రామిక ప్రతినిధులు హాజరయ్యారు. దేశంలోనే రెండవ అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా, శ్రీసిటీలో ఇప్పటికే ఇసుజు, యూనిచార్మ్, డైకిన్, టీ.హెచ్.కే వంటి 31 జపనీస్ కంపెనీలు, వాటికి విడిభాగాలు సరఫరా చేసే పలు పరిశ్రమలు ఉన్నాయన్నారు.

## తిరుమలలో దర్శన దళారి అరెస్ట్

**ప్రజాశక్తి -తిరుమల**

టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు ఫోటోను వాట్సాప్‌లో స్టేటస్‌గా పెట్టుకొని భక్తులను మోసగిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. చైర్మన్ పిఆర్వోగా భక్తులను దర్శనాలు పేరిట నమ్మిస్తున్న ఫరూక్ అలియాస్ ప్రసాద్ (45)ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. 'తిరుమల సమాచారం' అనే వాట్సాప్ గ్రూపులో భక్తులకు వల వేస్తూ ప్రసాద్ పలువురిని మోసగించాడన్న ఫిర్యాదులు అందాయి. డిమాండ్‌ను బట్టి డబ్బులను ఫోన్ పే ద్వారా వసూలు చేస్తూ, డబ్బులు వేసిన భక్తులకు దర్శన టికెట్ అడిగిన వెంటనే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిస్తూ మోసాలకు పాల్పడేవాడు. దాదాపు 80వేల రూపాయలు భక్తుల నుంచి వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. టుటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చైర్మన్ దృష్టికి బాధిత భక్తుడు తీసుకెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చింది. చైర్మన్ ఆదేశాలతో ఫిర్యాదు ఆధారంగా 318(4),319(2),66డి సెక్షన్ ల క్రింద నిందితుడిపై టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దళారులను నమ్మి మోసపోవద్దని భక్తులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. టిటిడి అధికారిక వెబ్‌సైట్ మాత్రమే భక్తులు నమ్మాలని పేర్కొన్నారు.

## అన్నప్రసాదంలో అదనంగా 'వడ' : టిటిడి ఛైర్మన్

**ప్రజాశక్తి -తిరుమల**

తిరుమల అన్నప్రసాదంలో అదనంగా 'వడ'ను జోడించారు. తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో గురువారం టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరిలతో కలిసి టిటిడి ఛైర్మన్ భక్తులకు వడ వడ్డింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత అన్న ప్రసాదం మెనూలో భక్తులకు అదనంగా ఒక పదార్థం వడ్డించాలని ఆలోచన కలిగిందన్నారు. ఈ విషయాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకెళ్లగా ఆయన అంగీకారంతో వడల వడ్డింపు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించామన్నారు. ఇప్పటికే భక్తులకు నాణ్యమైన దినుసులతో భక్తులకు రుచికరమైన అన్న ప్రసాదాలు అందిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు పంపిణీ చేసే వడ తయారీలో శెనగపప్పు, పచ్చిమిర్చి, అల్లం, కరివేపాకు, కొత్తిమీర, పొదీన, సోంపును ఉపయోగించనున్నారు. అన్న ప్రసాద కేంద్రంలో ఇకపై ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు 35 వేల వడలను భక్తులకు వడ్డించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సంఖ్యను మరింతగా పెంచి భక్తులకు రుచికరమైన భోజనం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు శాంతా రామ్, డిప్యూటీ ఈవోలు లోకనాథం, రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

## రేపు తుడా టవర్స్ వేలం

**తిరుపతి టౌన్ :** తిరుపతి నగరంలోని అన్నమయ్య కూడలి వద్ద తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ నిర్మిస్తున్న తుడా టవర్స్‌కు మార్చి 8 వ తేదీ నుండి వేలం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య తెలిపారు. గురువారం ఉదయం నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్‌ను ఇంజినీరింగ్ అధికారులతో పరిశీలించి, వేలం నిర్వహణపై తుడా కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య మాట్లాడుతూ మార్చి 8 వ తేదీ 2,3 అంతస్తులకు, 9వ తేదీ 4,5, అంతస్తులకు, 10 వ తేదీ 6, 7 అంతస్తులకు, 11 వ తేదీ 8,9 అంతస్తులకు, 12 వ తేదీ 10, 11 అంతస్తులకు ఉదయం 10 నుండి 1 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 6 గంటల వరకు వేలం నిర్వహిస్తామని అన్నారు. తుడా టవర్స్ నందు మోడల్ ఫ్లాట్, గ్యాలరీ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రైవేట్ నిర్మాణాలకు దీటుగా నాణ్యమైన మెటీరియల్ ఇందులో వినియోగించామని అన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర ఉన్నారు.

**సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు**

తిరుపతి నగరంలో ఏర్పాటు చేయనున్న సి.సి.కెమెరాల ఏర్పాటుకు పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుగుతున్న సిటీ ఆపరేషన్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డిజైన్ స్టూడియో, గ్లో గార్డెన్, గరుడ వారధి, తదితర ప్రాజెక్టుల పనుల పురోగతిపై ఆయా ప్రాజెక్టుల ప్రతినిధులు, స్మార్ట్ సిటీ అధికారులతో గురువారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈఈ రవి, డి.ఈ.లు రాజు, మహేష్, మధు, డీసీపీ మహాపాత్ర, ఏసిపి బాలాజి పాల్గొన్నారు.

## బిఎన్ఐ డైమండ్స్ ద్వారా వ్యాపారాభివృద్ధి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ (బిఎన్ఐ) వేదిక ద్వారా స్థానిక వ్యాపారాలు గ్లోబల్ స్థాయికి ఎదిగే అవకాశం ఉందని బిఎన్ఐ డైమండ్స్ తిరుపతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ అన్నారు. గురువారం తిరుపతి గ్రామీణ ప్రాంతంలోని ప్రముఖ హోటల్లో 150 మంది వ్యాపార యజమానులతో బిఎన్ఐ డైమండ్స్ తిరుపతి చాప్టర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి చాప్టర్ అధ్యక్షులు టెంకాయల దుర్గాప్రసాద్, బిఎన్ఐ సీనియర్ సపోర్ట్ డైరెక్టర్ సాయికిరణ్ రెడ్డితో కలిసి ఈడి సంతోష్ మీడియాతో మాట్లాడారు. బిఎన్ఐ ద్వారా దేశవ్యాప్తంగా ఎంతోమంది చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించి నేడు గ్లోబల్ స్థాయిలో తమ వ్యాపారాల ఉత్పత్తులను విక్రయించేలా ఎదిగారన్నారు. అమెరికా కేంద్రంగా పనిచేసే బిఎన్ఐ స్థాపించి 40 సంవత్సరాలు గడిచిందని, ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 11 వేల పైచిలుకు చాప్టర్లను కలిగి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో లాంచ్ డైరెక్టర్ స్వాతి వుదుమ, తిరుపతి చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ యువరాజ్ జైన్, సెక్రటరీ, కోశాధికారి డి.దేవి, లీడ్ విజిటర్ పోస్ట్ హరికష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆ తల్లికి గర్భ'శోకం'

**గ్రామమంతా చందాలు వేసుకుని వైద్యం చేయించినా..**
**రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కొడుకులు మృతి**
**'గట్టు' గ్రామంలో విషాదఛాయలు**

ప్రమాదంలో మృతిచెందిన బిడ్డలు

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్**

పుత్తూరు– చెన్నయ్ జాతీయ రహదారిలో ట్రాక్టర్, మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో అన్నదమ్ములు ఇద్దరూ మృతిచెందడం ఆ తల్లికి గర్భశోకాన్ని మిగిల్చింది..ఇద్దరు బిడ్డలు రవిశేఖర్ (17), మునికుమార్ (19) ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. ఉదయం అన్నదమ్ములు ఇద్దరూ కాలేజీకి వెళుతుండగా పిల్లారపట్టు బైపాస్‌రోడ్డు వద్ద ప్రమాదం జరిగింది. తమ్ముడు రవిశేఖర్ (17) అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడైన మునికుమార్‌ను పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని అమర ఆస్పత్రికి తీసుకెళ్లారు. అన్న మునికుమార్ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. బిడ్డలపైనే ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి బాధ వర్ణనాతీతం. పుట్టెడు దుఃఖంతో కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ ఘటనతో గట్టు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

గట్టు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు తల్లిదండ్రులు మంజునాథ్, లక్ష్మికి ఇద్దరు కుమారులు. కూలిపనులు చేసుకుంటూ కష్టపడి బిడ్డలను చదివించుకుంటున్నారు. ఘటన జరిగిన రోజే ఓ బిడ్డ మృతిచెందగా, మునికుమార్‌ను కాపాడుకునేందుకు అమర ఆస్పత్రిలో చేర్చారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ధనిక పేద అనే తేడా లేకుండా బిడ్డ మునిశేఖర్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు 12 లక్షల రూపాయలు ఖర్చు పెట్టినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. తిరుపతి – చెన్నయ్ జాతీయ రహదారి పిల్లారపట్టు బైపాస్ వద్ద ఆ మలుపు ప్రమాదాలకు పిలుపుగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఇద్దరు బిడ్డలను కోల్పోయిన ఆ తల్లిదండ్రులకు దిక్కెవరూ అంటూ కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. వందన వైన్స్ దగ్గర ప్రమాద మలుపుకు సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు అభ్యర్థిస్తున్నారు. తమ బిడ్డల చావుకు కారణమెవరని, తమకు ఇంకా దిక్కెవరని కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుటే ధర్నా నిర్వహించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. నిందితుని కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుత్తూరులో బాధిత కుటుంబీకుల ధర్నా

## విద్యార్థిని అక్షయ హనిప్రియకు అభినందన

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** పట్టణంలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఎస్.అక్షయ హని ప్రియా తెలంగాణ రాష్ట్రం, నల్గొండ జిల్లాలో జరిగిన జాతీయ షటిల్ బాల్ చాంపియన్ షిప్‌లో మూడవ స్థానం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డి.సదా శివం మాట్లాడుతూ సాధనతోనే దేనినైనా సాధించ గలుగుతా మని తెలియజేశారు. అక్షయ హనిప్రియను అభినందించారు.


విద్యార్థినిని అభినందనలు తెలుపుతున్న పాఠశాల అధినేత

## నాణ్యమైన విద్య, భోజనం అందించండి

**ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ:** నాణ్యమైన భోజనం మెరుగైన విద్య అందించాలని మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కనమనంబేడు పాఠశాల, బుచ్చి నాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గాజుల పెళ్లూరు ప్రాథమిక పాఠశాల, నిండలిగ్రి పాఠశాల, నీర్కటక పాఠశాలల్లో విద్యాశాఖ అధికారి గురువారం తనిఖీలు చేపట్టారు. పాఠశాల రికార్డులు, విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైసిపి నాయకులు రాజేష్‌కు నివాళి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** రూరల్ మండలంలోని గోపాల కృష్ణాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు సురేష్ సోదరుడు రాజేష్ మృతి చెందిన విషయం తెలియడంతో మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.కుమారస్వామి రెడ్డి, రాజేష్ భౌతిక కాయంపై నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రూరల్ మండలం కన్వీనర్ లోకనాథం, వైయస్సార్ సిపి ఎస్‌టి సెల్ ఇరువారం చిరంజీవి, దాసు, దేవేందర్ రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ రామ్ బత్తయ్య, మునిరాజు, శ్రీనివాసులు రెడ్డి, గోపి, దిలీప్, సెక్రటరీ చిరంజీవి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ సదస్సును జయప్రదం చేయండి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్:** విజయవాడలోని వెన్యూ ఫంక్షన్ హాల్‌లో బిఎస్పీ కార్యకర్తల మహాసదస్సు ఈ నెల 10వ తేదీన జరుగుతుందని బీఎస్పీ నాయకులు భాస్కర్ గౌడ్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ప్రధాన పోస్ట్ ఆఫీసు వద్ద గురువారం బీఎస్పీ నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాసిన భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ నోట్ల రాజ్యాన్ని కూలదోసి ఓట్ల రాజ్యాన్ని సాధిద్దాం అన్నారు. రాజ్యాంగం బద్ధంగా జరగాల్సిన ఎన్నికల అందుకు విరుద్ధంగా ఆగకుల మనువాద పార్టీల నాయకులు అక్రమంగా సంపాదించిన నోట్లతో పేద ప్రజల ఓట్లను కొనుగోలు చేసి అధికారంలోకి వచ్చారన్నారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. విజయవాడలో జరిగే బీఎస్పీ కార్యకర్తల సదస్సులో నియోజక వర్గం నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మీజూరు సుబ్రమణ్యం, గుంట మధుసూదన్ వెంకటేశ్వరరాజు, ఎల్వీ సుబ్బయ్య లక్ష్మయ్య వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

## 50 శాతం రాయితీతో అదనపు లోడు క్రమబద్ధీకరణ

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీతో అదనపు లోడ్ క్రమబద్ధీకరిస్తున్నామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్ నాయుడు పేర్కొన్నారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిలోవాట్‌కు డెవలప్మెంట్ ఛార్జీలు గతంలో రూ.2 వేలు వసూలు చేసేవారు, ప్రస్తుతం రూ. వెయ్యి చెల్లిస్తే చాలన్నారు. ఈ అవకాశం జూన్ 30 వరకు ఉంటుందన్నారు.

## జన సేన ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్:** ఈనెల 14వ తేదీ పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో కార్యకర్తలు అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని గూడూరు జనసేన నాయకులు కోనేటి మునిగిరీష్ పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని సొసైటీ ఉన్న లోటస్ భవన్‌లో గురువారం జనసేన పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. చలో పిఠాపురం పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో, నయిమ్, ఇంద్ర వర్ధన్, రాజు వెంకటేశ్వర్లు, జమాల్, చంద్ర, అవినాష్, శివ, కార్తీక్, రవి, పవన్, సుమన్, నారాయణ, చంద్ర మున్నా, బాబు, కృష్ణయ్య, కోటేశ్వరరావు, ముని గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## గుండె పోటుతో గిరిజనుడు మృతి

**ప్రజాశక్తి -దొరవారిసత్రం :** మండల పరిధిలోని శ్రీనమల్లి పంచాయతీ, కమ్మర గుంట గిరిజన కాలనీకి చెందిన మాజీకలు మనోహర్ (45) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు మనోహర్‌కు గుండెపోటు రావడంతో గుర్తించిన కుటుంబీకులు చికిత్స కొరకు సూళ్ళూరుపేటకు తీసుకెళ్లి వెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో పిల్లలు, భార్య జీవనోపాధి కష్టతరం కానుంది. మాజీ సర్పంచ్ పురుషోత్తం ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబానికి ప్రభుత్వం తరఫున సహాయం అందేలా కృషి చేస్తానన్నారు.

## నూతన దూరవిద్యా డైరెక్టర్‌గా రమేష్ బాబు

నోటిఫికేషన్ బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** ఎస్వీయూ నూతన దూరవిద్య డైరెక్టర్‌గా ఆచార్య పూక రమేష్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూరవిద్య విభాగానికి పూర్వ వైభవం తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్వీయూ దూరవిద్య కోర్సులకు 2025 మొదటి భాగానికి చెందిన నోటిఫికేషన్‌ను ఇంచార్జ్ వర్సిటీ విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, డైరెక్టర్ ఆచార్య పూక రమేష్ బాబు విసి చాంబర్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతానికి మొత్తం 17 పీజీ కోర్సులు, రెండు డిప్లమా కోర్సులకు నోటిఫికేషన్ ఇచ్చామని, ఆన్లైన్ ఏడో తారీఖు నుంచి అందుబాటులో రానున్నది ఈ నోటిఫికేషన్ మార్చి 25 వ తారీకు ముగియనున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సిడిసి ఆచార్య ఎస్ సి రాయుడు, గాలి దయాసాగర్, గిరిష్, రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## 'జాబ్ మేళా'లో 38 మందికి ఉపాధి అవకాశాలు: ఆర్ సి రెడ్డి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి నగర పరిధిలోని డాక్టర్ ఆర్ సి రెడ్డి డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్ మేళాను నిర్వహించడం జరిగిందని, ఇందులో 38 మంది విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సి రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐదు ప్రముఖ కంపెనీలు ఎంపికల ప్రక్రియ నిర్వహించాయన్నారు.

## 23 ఎర్రచందనం దుంగలు స్వాధీనం .. ముగ్గురు స్మగ్లర్ల అరెస్ట్

అదుపులోకి తీసుకున్న స్మగ్లర్లు, స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలను చూపుతున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** జాతీయ రహదారిపై శేషాచలంలోని అత్యంత అరుదైన 23 ఎర్రచందనం దుంగలను అక్రమంగా తీసుకెళుతున్న ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, దుంగలను స్వాధీనం చేసుకున్నట్టు టాస్క్ ఫోర్సు పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ బృందం బుధవారం రాత్రి నుండి శేషాచల అటవీ పరిధిలో అటవీ శాఖ అధికారులు ఎఫ్ఆర్వో మాల్యాద్రి, ఎఫ్బిఓ ఆదిశేషయ్యల సహకారంతో నెల్లూరు–గూడూరు జాతీయ రహదారి చవటపాళ్యం వద్దకు చేరుకుని వాహనాలు తనిఖీ చేపట్టార న్నారు. ఓ బొలేరో వాహనం ఆ మార్గంలో అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీ చేసే ప్రయత్నం చేయగా, అందులోని ముగ్గురు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. వారిని వెంబడించి టాస్క్ ఫోర్సు సిబ్బంది అదుపులోకి తీసుకున్నారన్నారు. పట్టుబడిన వారిని చిత్తూరు జిల్లా వాసులుగా గుర్తించామన్నారు. వారిని దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు.

## మా ఆర్థిక లావాదేవీలపై రాజకీయం సరికాదు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** రాజకీయంగా తనను ఎదుర్కోలేక లక్ష్మిరెడ్డికి తనకు మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలపై రాజకీయం చేయడం సరికాదని జనసేన నేత కిరణ్ రాయల్ అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరులతో ఆయన మాట్లాడారు. తన కుటుంబాన్ని సామాజిక మాధ్యమాల్లో ఇష్టం వచ్చినట్లు ట్రోల్ చేశారని, దీనితో మానసిక క్షోభను అనుభవించానన్నారు. ఇందుకు కారణం అయిన వారు ఎవరో తనకు తెలుసని, వారిని వదిలిపెట్టనని స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాలతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నానని, రాబోయే రోజుల్లో పార్టీ ఆదేశిస్తే చురుగ్గా పాల్గొంటానని తెలిపారు.

## మంత్రి సత్య కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్:** అసెంబ్లీ సమావేశాలులో భాగంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని వినతిపత్రం అందచేశారు.

## సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

**ప్రజాశక్తి నాగలాపురం:** సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం అసెంబ్లీ సమావేశం అనంతరం మంత్రి లోకేష్‌ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మర్యాదపూర్వకంగా కలిసి తన నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కారం కోరుతూ వినతి పత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన లోకేష్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

## బీసీ రుణాల మేళా

**ప్రజాశక్తి - ఓజిలి :** బీసీ కార్పొరేషన్ రుణాల మేళా కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని బీసీ కార్పొరేషన్ ద్వారా మండల వ్యాప్తంగా 52 యూనిట్లు మంజూరు చేయగా, ఇందుకుగాను నిరుద్యోగ అభ్యర్థులు దాదాపు 272 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వైద్యశాఖ ,పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## గృహాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

**ప్రజాశక్తి - రామచంద్రపురం:** మండలంలోని ప్రభుత్వ, గయాలి భూములను ఆక్రమించి నిర్మించిన పక్కా గృహాల క్రమబద్ధీకరణకు సచివాలయాలలో దరఖాస్తులు చేసుకోవాలని తహసిల్దార్ కే వెంకటరమణ గురువారం ఒక పర్యటనలో తెలిపారు. మండలంలో ఆక్షేపణలేని ప్రభుత్వ, అనాధీనం, గయాలి భూముల్లో పేదల నిర్మించుకొని ఉన్న పక్కా గృహాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ నెంబర్ 13 ఆదేశాలు జారీ చేసిందన్నారు. మండలంలో ఎవరైనా పై తెలిపిన భూముల్లో గృహాలు నిర్మించుకుని ఉంటే ప్రజలు సచివాలయాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూలై 1 2019 కి ముందుగా గృహం నిర్మించుకొని ఉన్న పేద ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ వి లక్ష్మీనారాయణ, సర్వేయర్ ఎస్ రమేష్ బాబు, మణి, వీఆర్ఏ గీత తదితరులు పాల్గొన్నారు

## ఎస్వీయూలో ఏపిపిజిసెట్-2025 కేంద్ర కార్యాలయం ప్రారంభం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఏపిపిజిసెట్ – 2025 నిర్వహణ బాధ్యతలను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అప్పగించింది. ఆ సెట్ కేంద్ర కార్యాలయాన్ని ప్రాచ్య పరిశోధన సంస్థలో ఎస్వీయూ ఇంచార్జీ విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సెట్‌కు కన్వీనర్‌గా ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు, కో–కన్వీనర్‌గా ఆచార్య సురేంద్రబాబు వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏపిపిజిసెట్ కార్యాలయ సిబ్బంది కామేశ్, ఏపిఆన్లైన్ సహాయకులు విశ్వవిద్యాలయ ఆచార్యులు పాల్గొన్నారు.

## వెంకటేష్ కుటుంబానికి అండగా ఉంటాం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)** శ్రీకాళహస్తి ఫారెస్ట్ రేంజ్ పరిధి సింగమాల ఫారెస్ట్ చెక్ పోస్టులో ప్రొటెక్షన్ వాచర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు గత ఏడాది మరణించిన వెంకటేష్ కుటుంబానికి అండగా ఉంటామని తిరుపతి సర్కిల్ సిసిఎఫ్, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం అన్నారు. గురువారం బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా విడుదల చేయబడిన నాలుగు లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా డిడిని జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్, శ్రీకాళహస్తి ఎఫ్ఆర్వో లోకేష్ అందించారు. వెంకటేష్ పిల్లల చదువుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దేవరాజులు, ఎఫ్ బి ఓ దామోదరం పాల్గొన్నారు.

## 'మాజీ సీఎం నోరు అదుపులో పెట్టుకోవాలి'

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)** మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, మరొక్కమారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గురించి ఇష్టానుసారం మాట్లాడితే తగిన రీతిలో స్పందించి బుద్ధి చెబుతామని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిని హెచ్చరించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గవర్నర్ అసెంబ్లీలో తన ప్రసంగాన్ని వినిపించే సమయంలో ప్రతిపక్ష హోదా కావాలని కేకలు వేయడం ప్రజలందరూ చూశారన్నారు. మళ్లీ డిప్యూటీ సీఎంపై దురుసు మాటలు మాట్లాడితే ఊరుకోమని స్పష్టం చేశారు.

**తిరుపతి సిటి :** వైఎస్ఆర్ ముఖ్యమంత్రి పదవి చేపట్టాకే ప్రజాప్రతినిధిగా జగన్మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారన్న వాస్తవాన్ని మరచి పవన్‌కల్యాణ్‌ను విమర్శించడం తగదని జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి అన్నారు. పవన్‌కల్యాణ్ విలాసవంతమైన జీవితాన్ని వదిలి రాష్ట్ర ప్రజల కోసం ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పేరు చెబితే 11 సిబిఐ కేసులు, కోడికత్తి, గొడ్డలిపోటు గుర్తుకొస్తాయన్నారు.

## 'మా భూమిని స్వాధీనం చేయండి'

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)** మా అత్త నాగభూషణమ్మ స్వయార్జితమైన భూమి మంగళం గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 78/2బి1లో దాదాపు 2 ఎకరాలు ఉందని, అయితే సదరు భూమిని కొంతమంది వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపట్టడం దారుణమని, జిల్లా ఉన్నతాధికారులు కలగజేసుకొని భూమిని రక్షించి తమకు స్వాధీన పరచాలని తిరుపతి కట్టకింద పల్లికి చెందిన పావని కోరారు. గురువారం మంగళం పరిధిలోని మంగళం – శెట్టిపల్లి గ్రామ మార్గంలోని మిట్ట గాంధీపురం వద్దగల వివాద భూమి వద్ద మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1976లో సదరు భూమిని కొనుగోలు చేశామని, అప్పట్లో రిజిస్ట్రేషన్లు జరిగాయని, గత ఏడు నెలల కాలంగా రాజకీయ పార్టీకి చెందిన రాజారెడ్డి, అమర్నాద్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి అనే వ్యక్తులు తనను బెదిరిస్తూ, భూమిని యథేచ్ఛగా చదును చేసి ఫ్లాట్లు వేసి విక్రయించాలని కుట్రపన్నారన్నారు. తాను భర్త చనిపోయి పిల్లలను పెంచి పోషించడానికి కూడా అవస్థలు పడుతున్నానని, తన భూమికి రక్షణ కల్పించి స్వాధీన పరచాలని వేడుకున్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్

**ప్రజాశక్తి - రేణిగుంట:** విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ప్రముఖ సంఘ సేవకులు, ఆంధ్రశ్రీ అవార్డు పురస్కార గ్రహీత డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందిస్తున్న ఆయన గురువారం రేణిగుంట మండలంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ మండలంలోని గాజులమండ్యం, గుత్తివారిపల్లి, అన్నాస్వామిపల్లి గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గాజుల మండ్యం, గుత్తివారిపల్లి, అన్నాస్వామిపల్లి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, పురుషోత్తం, సునీత తదితరులు పాల్గొన్నారు.

## దశరథాచారికి గాలి పరామర్శ

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** టిడిపి రాష్ట్ర కార్యదర్శి గుమ్మిడిపూడి దశరథాచారిని ఆ పార్టీ తొట్టంబేడు మండల అధ్యక్షులు గాలి మురళి నాయుడు గురువారం పరామర్శించారు. దశరథాచారి అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా గాలి మురళి నాయుడు దశరథాచారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మోహన్, దొరబాబు, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించిన టిటిడి ఛైర్మన్

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర విభాగ ఆచార్యులు జె.కామాక్షమ్మ నిర్వహించే "సాంప్రదాయ ఔషధము.. ఆధునిక, సహజ ఆరోగ్య రక్షణ ఏకీకృత విధానం" అనే అంశంపై ఏప్రిల్ 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సు కరపత్రాన్ని తిరుమలలో తితిదే ఛైర్మన్ అధికారిక భవనంలో ఛైర్మన్ బిఆర్ నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ ఔషధం ఆధునిక చికిత్స విధానంలో అనుసంధానం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య నాగలక్ష్మి దేవమ్మ, చంద్ర పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** తిరుపతి స్థానిక బైరాగి పట్టడలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఐపిఎల్ బ్రాంచ్‌లో ముగ్గురు విద్యార్థులు కరాటే పోటీల్లో నోబెల్ వరల్డ్ రికార్డ్ సాధించారు. ఒక్క నిమిషానికి 100 పంచ్ స్ట్రైక్ చేసిన నిత్యశ్రీ రెండవ తరగతి, రోహన్ ఆనంద్ ఏడవ తరగతి, దుర్గా యోజిత్ 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ఘనత సాధించారు . ప్రిన్సిపల్ అన్నపూర్ణ ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యాసంస్థల ఏజీఎం సురేష్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నపూర్ణ, ఏవో రవి బాబు, ఆయా విభాగాల ఇన్చార్జిలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ గుడి మాది.. కాదు మాది

### ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ

**ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి):** మండలంలోని శ్రీనివాస మంగాపురంలో తిరుపతి భాకరాపేట ప్రధాన రహదారి పక్కన ఉన్న శ్రీ కనకదుర్గమ్మ గుడి మాది అంటూ ఒక వర్గం మీది కాదు మాది అంటూ మరొక వర్గం గురువారం ఉదయం ఘర్షణ పడ్డారు. పూసలు అమ్ముకునే జీవించే సుగాలీలు కుల దైవంగా భావించి పూజలు చేసుకునేవారు. వీరు వ్యాపార నిమిత్తం బళ్లారి, బెంగళూరు, అనంతపురం, తిరుపతి ప్రాంతాలలో స్థిరపడ్డారు. గురువారం సుగాలీలందరూ శ్రీ కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేసేందుకు దేవాలయానికి చేరుకున్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు కనకదుర్గమ్మ గుడి మాది మీరేంటి పూజలు చేసేదంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో సుగాలీలందరూ మా పూర్వీకుల నుండి కనకదుర్గమ్మను పూజించుకునేవారమని స్థానికులతో వాగ్వివాదానికి దిగడంతో ఉధృత వాతావరణం ఏర్పడింది. విషయం తెలుసుకున్న చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాల మధ్య ఘర్షణ అదుపు చేయడానికి ప్రయత్నించగా ఒక వర్గం వారు పోలీసులపై తిరగబడ్డారు. కనకదుర్గమ్మ గుడి వివాదం స్థానికులు, స్థానికేతరుల మధ్య వివాదం తార స్థాయికి చేరింది. చివరికి పోలీసులు వివాదాన్ని సర్దుబాటు చేశారు. సుగాలీలు శ్రీ కనకదుర్గ అమ్మవారి కి పూజలు చేసుకుని వెళ్లిపోయారు.

## పోలీస్ స్టేషన్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** తిరుపతి రైల్వే పోలీస్ స్టేషన్, తిరుపతి తూర్పు, మహిళ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు గురువారం రాత్రి పరిశీలించారు. అనంతరం నగరంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన సహించేది లేదని హెచ్చరించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి పోలీసుల పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ బీ. హేమంత్, ఏఎస్పి రవి మనోహర ఆచారి, డిఎస్ పి శ్రీలత, సీఐలు సాధిక్ అలీ, ఎస్సైలు పాల్గొన్నారు.

## మహిళా రైతు కొడవకంటి యువరాణికి ఘన సన్మానం

**ప్రజాశక్తి -రామచంద్రాపురం:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని కమ్మకండ్రిగ పంచాయతీ మిట్టూరు గ్రామానికి చెందిన మహిళ రైతు కొడవకంటి యువరాణిని (ఇన్నోవేటివ్ ) ఉత్తమ మహిళా రైతుగా ఎంపిక చేసి గుంటూరు, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు గురువారం ఘనంగా సన్మానించారు. గురువారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు కృష్ణ ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదస్సులో కొడవకంటి యువరాణి, భర్త పురుషోత్తమ నాయుడులు ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి, వేరుశనగ, కొబ్బరి పంటలను తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని పొందడంలో విజయవంతంగా సాగు చేస్తున్నారని వైస్ ఛాన్సలర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి, వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి రాజశేఖర్, విశ్వవిద్యాలయ అధికారులు దుశాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

## చెరువు కాడ ఇండ్లు రోడ్డు ఆక్రమణలు తొలగింపు

### దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించిన రెవెన్యూ అధికారులు

### ఎమ్మెల్యే పులివర్తి నాని, రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

**ప్రజాశక్తి - రామచంద్రపురం:** తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రపురం మండలంలోని అనుప్పల్లి గ్రామ సమీపంలో ఉన్న గోకులాపురం నుండి చెరువు కాడ ఇండ్లకు వెళ్లే రోడ్డు ఆక్రమణలను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. మూడు దశాబ్దాలుగా చెరువు కాడ ఇండ్లకు, రైతుల పొలాలకు వెళ్లే రహదారిని గ్రామానికి చెందిన కే.సుబ్బారెడ్డి ఆక్రమించుకొని ప్రజలకు, రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగించే వారు. ఆ రోడ్డులో వాహనాల రాకపోకలకు కూడా కష్టంగా ఉండేది. ఈ దీర్ఘకాలిక సమస్యను గతంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాలేదు. ఎన్నికల్లో ఎమ్మెల్యే నాని ఇచ్చిన హామీ మేరకు గురువారం తహసిల్దార్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ రమేష్ బాబు, ఆర్ సి పురం పోలీసులు రోడ్డును సర్వే చేస్తుండగా ఆక్రమణదారుడు కే సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు, వర్గీయులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆక్రమించడమే నేరమని, తొలగింపు అడ్డుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించడంతో వారు వెనుదిరిగారు. ఈ ఆక్రమణ తొలగింపు కార్యక్రమంలో స్థానికులు కొర్లకుంట శివారెడ్డి, జయ చంద్ర రెడ్డి, కానాల దామోదర్ రెడ్డి, కే మధుసూదన్ రెడ్డి, ఎం విశ్వనాథం, కే చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ హేమ శేఖర్ రెడ్డి, పాల్గుణయాదవ్, వై విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నులు వంద శాతం పూర్తి చేయాలి

**ప్రజాశక్తి - ఓజిలి :** మండలంలోని 26 పంచాయతీలకు సంబంధించి ఇంటి పన్ను వసూళ్లు మార్చి ఆఖరుకు వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి, డిఎల్ పిఓ రవీంద్రబాబు పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశారు. ఎంపీడీవో విజయలక్ష్మి , డిఎల్పిఓ రవీంద్రబాబు స్వయంగా గృహాల వద్దకు వెళ్లి ఇంటి పన్ను వసూళ్లకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈఓపిఆర్ రేణుక, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

**ప్రజాశక్తి -కోట :** ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని గూడూరు డిఎల్పిఓ వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని చెందోడు పంచాయతీలో ఇంటి పన్నులపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చెందోడు పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యానగర్లోని పలు దుకాణాలకు ఇంటి పన్నును అందజేసి సకాలంలో చెల్లించాలని తెలియజేశారు. ఈ మేరకు విద్యానగర్లోని దుకాణాల యజమానులు, చెందోడు పంచాయతీలోని ఇంటి యజమానులకు ఇంటి పన్నులు చెల్లించాలని ప్రతి ఒక్కరిని చైతన్యవంతం చేశారు. అనంతరం డిఎల్పిఓ వెంకటరమణ, స్థానిక చెందోడు పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి తోడ్పాటుకు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించే విధంగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ వెంకటరమణ, చెందోడు పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, వీఆర్వో గౌతమి, ఎంపిటిసి ఎంబేటీ. శశి, తదితర పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు 33,228 మంది విద్యార్థులు హాజరు

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** జిల్లాలో గురువారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 33,228 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్.ఐ. ఓ జీ.వి.ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 86 జనరల్, 15 వొకేషనల్ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మ్యాథమాటిక్స్ పేపర్ –1 ఏ, బాటనీ పేపర్ –1, సివిక్స్ పేపర్ –1, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు జనరల్ 32,830 మంది, ఒకేషనల్లో 1,341 మంది మొత్తం 34,171 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా జనరల్లో 849, ఒకేషనల్లో 94 మంది, మొత్తం 943 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు.

# క్రైం న్యూస్

## అంతర్ రాష్ట్ర గొలుసు దొంగలు అరెస్టు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** రద్దీ ప్రాంతాల్లో అదును చూసి మహిళల మెడలో బంగారు గొలుసులు కాజేసే ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను గురువారం వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.8 లక్షలు విలువచేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ దొంగలు మహిళలు కావడం గమనార్హం. ఆ వివరాలను స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ నరసింహమూర్తి గురువారం మీడియాకు వివరించారు. గత నెల 27వ తేదీన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పార్వతీ పరమేశ్వరుల రథోత్సవం జరిగింది. రథోత్సవానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో పట్టణ నాలుగు మాడవీధుల్లోని పలు రద్దీ ప్రాంతాల్లో ఆరు చోట్ల మహిళల మెడలో బంగారు చైనులు చోరీకి గురయ్యాయి. ఆ మేరకు బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేశారు. అందులో భాగంగా తమిళనాడుకు చెందిన మీనా(29), పొన్నామణి(34)లను గురువారం అదుపులోకి వారి వద్ద నుంచి 105 గ్రాములు బరువున్న 7 బంగారు చైనులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడ్డ మహిళలిద్దరూ అక్కాచెల్లెళ్ళనీ, తమిళనాడులో పలు చోరీల్లో ముద్దాయిలుగా ఉండి ఇటీవలే బెయిల్‌పై విడుదలైనట్లు డీఎస్పీ తెలిపారు. వీరిద్దరూ ఉత్సవాలు, రద్దీగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడే వారిని చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలిస్తున్నట్లు వివరించారు. చోరీ కేసులను అనతి కాలంలోనే చేధించిన వన్ టౌన్ సీఐ గోపీతో పాటు ఆయన సిబ్బందిని డిఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో టూ టౌన్ సిఐ వెంకటేశులు, రూరల్ సీఐ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి వ్యాపారి అరెస్ట్.. 5 కేజీల గంజాయి స్వాధీనం

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** గంజాయి అక్రమంగా విక్రయిస్తున్న వ్యాపారిని అదుపులోకి తీసుకునే అతని వద్ద నుంచి 5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న ఈస్ట్ ఎస్ఐ మహేష్ తెలిపారు. గురువారం రాత్రి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్ టీవి నగర్ కురబ అరవింద్ తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో రహస్యంగా గంజాయి విక్రాయిస్తుండగా పోలీసులు అదుపులో తీసుకున్నారు. అన్నవరం నుండి బసులో తరలించి చిన్నపొట్లాలు గా తయారు చేసి ఒక్కొక్కటి 300 రూ/– విక్రయం చేవాడని, అన్నవరం వరకు సప్లై చేసే వ్యక్తి ఒరిస్సా కు చెందిన వ్యక్తి గణేష్ అని నిందితుడు పోలీసులవద్ద వెల్లడించడని తెలిపారు. గణేష్ ను త్వరలో అరెస్ట్ చేయవలసి వుందని...ప్రస్తుత పట్టు బడిన వ్యక్తి రిమాండ్ కు తరలిస్తున్నట్లు ఈస్ట్ ఎస్ ఐ మహేష్ వెల్లడించారు.

## ఆటో ఢీకొని భార్యాభర్త మృతి.. చిన్నారికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ :** గూడూరు మండల పరిధిలోని తిప్పవరప్పాడు గ్రామ సమీపంలో గురువారం రాత్రి ఆటో – స్కూటీని ఢీకొనడంతో భార్య, భర్త మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గూడూరు రూరల్ ఎస్. ఐ.మనోజ్ కుమార్ కథనం మేరకు సైదాపురానికి చెందిన భార్యాభర్తలు దొడ్డగ మునయ్య (40), జ్యోతి (30)లు తమతో కుమార్తె స్కూటీ లో గూడూరు నుండి సైదాపురానికి వెళ్తున్నారన్నారు. అదే మార్గంలో వస్తున్న ఆటో ఢీకొనడంతో మునెయ్య, జ్యోతిలు అక్కడికక్కడే మృతి చెందారు. పాపకి గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నమని పోలీసులు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL. DISTRICT JUDGE; TIRUPATI
I.A.NO.89/2024, A.S.NO.79/2017

B.Mangamma and Others ...Petitioner/Appellants

V/s

1) M.Narasamma, 2) N. Subbamma
3) the Suprintendant, SVRRGG Hospital Tirupati. ...Respondents

NOTICES TO THE RESPONDENT NO.1

R1) M.Narasamma W/o Lakshmaiah, TTD Employee, R/o D.No.503, D-Type Quarters, K.T.Road, Tirupati, Chittoor District.

Phase take notice that the above I.A.No.89 /2024 filed by the petitioners for restoration of the appeal and the notice to the Respondent No.1 is not served and the Hon'ble Court order substitute Service of notice and the above I.A. Posted for notice for your presence an 25.03.2025 notice the Hon'ble Court either in person or though your counsel at about 10.30 am failing which the matter will be decide ex-parte.

Hearing Date: 25.03.2025

L.VENKATRAMANA
V.BARGAVI YADAV
Advocates, Tirupati. Cell: 290104511

మహారాజశ్రీ గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S No. 55 / 2021

1.గుండు శ్రీనివాసులు
2.చెంజి మురుగనందం
3.చెంజి కృష్ణ ...వాదులు

వర్సెస్

1.ధేనూరు మునిరాజమ్మ మరియు 10 ఇతరులు ... ప్రతివాదులు

2వ ప్రతివాదికి దావా సమను

To
పి. రామక్రిష్ణయ్య, తండ్రి సుబ్బయ్య, SC కాలనీ, యాతలూరు గ్రామం, వేంకటగిరి మండలం, తిరుపతి జిల్లా.

పై నెంబరు కేసులో వాదులు మీ పైన పై తెలిపిన కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ వారు మీకు నోటీసు నిమిత్తం 21-03-2025వ తేదికి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం గం.10-30 లకు మీరు స్వయంగా కానీ, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల ఎటువంటి అభ్యంతరములు లేనట్లుగా మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు
సి.వి.వి సాయి వర ప్రసాద్, బి.ఎ., బి.ఎల్.,
వాదుల తరుపు న్యాయవాది
వేంకటగిరి

# ఘనంగా వాకా విజయభాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి -కోట :** కోట మండలంలోని చెందోడు పంచాయతీలోని తిరుపతి కార్యనిర్వాహక సీనియర్ టిడిపి నాయకులు వాకా.విజయభాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గురువారం విద్యానగర్ లోని టిడిపి సీనియర్ నాయకులు వాకా. విజయభాస్కర్ రెడ్డి నివాసం వద్ద తల్లిదండ్రులైన నరసింహారెడ్డి దంపతులు, టిడిపి నాయకులు వాకా.విజయభాస్కర్ రెడ్డి అభిమానులు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వాకా.విజయభాస్కర్ రెడ్డి తల్లిదండ్రుల చేతుల మీదుగా 40 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అంతేకాకుండా విద్యానగర్ గాంధీ బొమ్మ వద్ద భారీ కేకును కట్ చేసి అందరికీ పంచి పెట్టారు.అదేవిధంగా భారీగా బాణసంచా పేల్చి భారీ సంఖ్యలో పాల్గొన్న టిడిపి నాయకులు,అభిమానుల మధ్య వాకా. విజయభాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు జరిపారు.వాకా.విజయభాస్కర్ రెడ్డి జన్మ దిన వేడుకలకు భారీ సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు బందిల. రఘురామ్,కార్తికేయ మినరల్స్ అధినేత రాయపు.సుబ్రహ్మణ్యం,టిడిపి సీనియర్ నాయకులు కొనిశెట్టి రమేష్, పల్లెమల్లు. వెంకట కృష్ణారెడ్డి,షేక్.మస్తాన్ భాష, పల్లెమల్లు.రఘునాథ్ రెడ్డి,బూసి. సుబ్రహ్మణ్యం,రాంబాబు,కాకు. కోటేశ్వరరావు,వెంకటేశ్వర్లు,తదితర టిడిపి నాయకులు,చెందోడు గ్రామ ప్రజలు, స్థానిక దుకాణదారులు,వాకా. విజయభాస్కర్ రెడ్డి అభిమానులు, యూత్ భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### నిరుద్యోగ యువత

## సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి - క్యాంపస్ :** రాష్ట్రంలో సంవత్సర కాలంగా ఎలాంటి ఉద్యోగ ప్రకటనలు, ఉద్యోగ నియామక ప్రక్రియలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేయాలని, నిరుద్యోగ యువత సమస్యలపై పోరాటాలు చేస్తామని వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం రాయలసీమ ఇంచార్జ్ విహరి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో పలు అంశాలను చర్చించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత యొక్క సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు.

### పోలీసులకు ఫిర్యాదు చేసే

## విధానంపై అవగాహన

**ప్రజాశక్తి -ఏర్పేడు :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినులు ఏర్పేడు యూజీ పోలీస్ స్టేషన్‌ను గురువారం సందర్శించారు. పోలీసులు ఫిర్యాదులు ఎలా ఏస్తారు, పోలీసు విధివిధానుల ఎలా ఉంటాయి అనే వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కే. శివకుమార్ ఫిజికల్ డైరెక్టర్ తొమ్మిదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

సరస్వతీ పూజా కార్యక్రమానికి విచ్చేసిన పులివర్తి సుధారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి - రామచంద్రాపురం:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి అన్నారు. మండలంలోని సొరకాయలపాళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం పదవతరగతి వీడ్కోలు సమావేశానికి, సరస్వతి పూజా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఆశీర్వదించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 17 నుండి 31తేదీ వరకు జరిగి 10వ తరగతి పరీక్షలలో ప్రతి ఒక్క విద్యార్థి ఏకాగ్రతతో చదివి పరీక్షలు వ్రాసి అత్యధిక మార్కులతో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమల రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ఎన్ చిన్న బాబు, నాయకులు చేకూరి జనార్ధన్ చౌదరి, రావిళ్ళ గిరిబాబు, మాజీ సర్పంచ్లు మాధవి, పూజారి సుబ్రహ్మణ్యం యాదవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఈ ఉమాపతి నాయుడు, కొట్టే నరసింహా రెడ్డి, సీనియర్ నాయకులు నాథమునియాదవ్, ముని రామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, డిల్లీ నాథ్ రెడ్డి, కొట్టే ధనుంజయ రెడ్డి,, వసంత నాయుడు, సాయిరెడ్డి, కిశోర్ రెడ్డి, కె.జగదీష్, చేకూరి వెంకట ప్రసాద్, చంద్రబాబు యాదవ్,పూర్వ విద్యార్థులు మధుసూదన్, రమేష్, చెంగయ్య, ముని చంద్ర నాయుడు మండల విద్యాధికారి జయవేలు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యకు మార్గదర్శి స్క్వేయర్ కన్సల్టెన్సీ



**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** విద్యార్థుల, తల్లిదండ్రుల ఉన్నత లక్ష్యాలకు మార్గదర్శిగా స్క్వేయర్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సర్వీసెస్ పనిచేస్తుందని ఆ సంస్థ డైరెక్టర్లు రమణ, రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో గురువారం స్క్వేయర్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీని ఎస్వీయూ వీసీ అప్పా రావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కన్సల్టెన్సీ డైరెక్టర్లు మాట్లాడుతూ ఎంతో మంది మధ్యతరగతి, పేద విద్యార్థులు డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంబీబీఎస్, ఎంబీఏ, ఎంసీఏ, అగ్రికల్చరల్, కామర్స్, ఆర్ట్స్ విభాగాలలో చేరేందుకు సరైన గైడెన్స్ లేకపోవడంతో తాము ఎంచుకున్న ఉన్నత విద్యకు దురమవుతున్నారని తెలిపారు. గత 18ఏళ్ల నుంచి మా సంస్థ ఎంతో మంది విద్యార్థులకు పలు కోర్సులో అడ్మిషన్లు కల్పించడం జరిగిందన్నారు. తమిళనాడులోని ఎస్ఆర్ఎమ్, అమృత, వీఐటీ సాయి, తక్షశిల వర్సిటీ వంటి పేరొందిన డీమ్డ్ వర్సిటీలలో ప్రవేశాలకు సంబంధించి ఆసక్తిగల విద్యార్థులకు సహాయసహకారాలు అందించి వారి కలను నెరవేరుస్తామని చెప్పారు. అలాగే కర్ణాటక రాష్ట్రంలోని పేరొందిన అన్ని వర్సిటీలలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు అడ్మిషన్లు పొందేందుకు గైడెన్స్ అందిస్తామని తెలిపారు. ఇంటర్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఫీజురాయితీలతో పాటు, స్కాలర్షిప్లు అందిచే ఏర్పాటు చేస్తామని తెలిపారు. కోర్సు పూర్తి చేసినంతవరకు విద్యార్థులను పర్యవేక్షిస్తూ ఉంటామని తెలిపారు. అలాగే ఎంబీబీఎస్ అడ్మిషన్ల విషయంలోనూ చిత్తూరు అపోలో,నారాయణ, నంద్యాల శాంతీ రామ్ మెడికల్ కళాశాలలో ప్రవేశాలకు గైడెన్స్ అందిస్తామని తెలిపారు. అడ్మిషన్ల గైడెన్స్ కోసం 9640777757, 8106020030 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## సిమ్స్ డిడి నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రభావతిని సస్పెండ్ చేయాలి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** సిమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్నటువంటి కార్మికుల పట్ల డిడి నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రభావతి పై చర్యలు తీసుకోవాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సిమ్స్ డైరెక్టర్ ఆర్ వి కుమార్ కలిసి కార్మికుల సమస్యలపై పరిష్కారం చేయాలని లక్ష్మీ శ్రీనివాస మాన్ పవర్ కార్పొరేషన్ లో విలీనం చేసినప్పటి నుంచి మిగిలిన కార్మికులందరికీ జీతాలు పెరగడం వారు చేస్తున్న పనులు హెూదాలు మార్పు చేయడం అన్ని క్రమంగా మిగిలిన వారికి జరుగుతున్నప్పటికీ వార్డు బాయిల్ గా ఉన్నటువంటి కార్మికులకు పేరు మార్చకపోవడం జీతాలు పెరగకపోవడం వారి సమస్యల పట్ల ఏమాత్రం పట్టించుకోకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందని ఈ సమస్యల పట్ల తక్షణ స్పందించి పరిష్కారం చేయాలని తెలిపారు. కార్మికులు దాదాపు 35 ఏళ్ల నుంచి పని చేస్తున్నటువంటి వారి పట్ల డిడి నర్సింగ్ సూపర్డెంట్ ప్రభావతి కార్మికుల అంటే అసహనం వ్యక్తం చేయడం ఇష్టానుసారంగా ఆమె నచ్చలేదంటే రేపటి నుంచి నువ్వు డ్యూటీలోకి రావడానికి వీలు లేదని చెప్పి నిర్ధాక్షణ్యంగా కార్మికులను డ్యూటీలకు రానివ్వకుండా చేయడం నిలిపివేయడం నానా బూతులు మాట్లాడడం కార్మికులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నది. విధి నిర్వహణలో ఆమెకు ఎదురు మాట్లాడితే కార్మికులకు చుక్కలు చూపించడం ఉద్యోగాల్లోని తొలగించడం ఆమె నైజం ఆమెను తొలగిస్తే కానీ కార్మికులు వారి పని వారు చేసుకునే పరిస్థితి లేదు. వైసీపీ ప్రభుత్వంలో సిమ్స్ లో అప్పటి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తులను తీసుకుని వచ్చి హాస్పిటల్లో ఎన్నికల ప్రచార మీటింగులు ఏర్పాటు చేయడం కార్మికులను దాదాపు 400 మందిని వైసిపి ప్రచార కార్యక్రమాలకు పంపించడం కార్మికుల మేము వెళ్ళము అంటే వారిని ఉద్యోగాలను సైతం తొలగించినటువంటి నైజం ఈ ప్రభావతి ది.గత పది సంవత్సరాలుగా అనేక ఆరోపణలు ఎదుర్కొంటూ సస్పెన్షన్ గురై 10 సంవత్సరాలు హాస్పిటల్ కు దూరంగా ఉన్నటువంటి ఈ ప్రభావతి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాంగానే 2019లో తిరిగి మళ్ళీ హాస్పిటల్ లో రంగప్రవేశం చేయడం జరిగింది. దాదాపు కోటి రూపాయలు పైన జీతం ఒక్కసారిగా డ్రా చేసుకున్నది. కార్మికులకు ఇచ్చే చాలీచాలని జీతాలు కుటుంబాలు బతకలేకపోతున్నామని మేము గతంలో వార్డు బాయలుగా మా పేరు ఉన్నదాన్ని యధావిధిగా అదే విధంగా కొనసాగించాలని అడిగితే కార్మికులపై కన్నెర చేస్తుంది ప్రభావతి దీనికి వంత పాడుతున్న యాజమాన్యం తక్షణం యాజమాన్యం నిష్పక్షపాతంగా వ్యవహరించి కార్మికుల సమస్యల పట్ల న్యాయ పరిష్కారం చేయాలని ప్రభావతిని వెంటనే సస్పెండ్ చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఇవాళ సిమ్స్ లో ఈ ప్రభావతిని కాపాడడానికి అనేక కుయుక్తులు చేస్తూ కొన్ని కాగితాల్లో దొంగ సంతకాలు చేయించుకోవడం ఆమెకు మద్దతుగా అనేక రకాలైనటువంటి కాగితాలను రాయించుకునే కార్యక్రమం చేపడుతున్నారు ఈ విధానం వెంటనే ఆపాలి కార్మికులకు న్యాయం చేయాలని సిహెచ్ డిమాండ్ చేస్తున్నది.

## పశు వైద్య విద్యార్థుల ఉపకార వేతనాలు పెంచండి

**ప్రజాశక్తి - క్యాంపస్ :** తిరుపతిలోని స్థానిక శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో గత 32వ రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న పశువైద్య విద్యార్థుల ఉపకార వేతనాలను పెంచాలని ఆ విద్యార్థి సంఘం నాయకుడు పవన్ నాయక్ డిమాండ్ చేశారు. విద్యార్థుల ధర్నాకు సహకరించకుండా వర్సిటీ ఉన్నతాధికారులు హాస్టల్ వసతి గృహాలను, మెస్ఎ లను మూసివేస్తామని హెచ్చరించడంతో బుధవారం విద్యార్థులు ప్రధాన గేటు తాళాలు వేసి ఉద్యోగులు ఎవరు క్యాంపస్ లోకి రాకుండా పెద్ద ఎత్తున అష్టదిర్బంధనంతో ధర్నా నిర్వహించారు. దీంతో ఏఎస్పి రవిమనోహరచారి చొరవతో విద్యార్థులు ప్రధానమైన మూడు డిమాండ్లకు వర్సిటీ ఉన్నతాధికారులను ఒప్పించి హాస్టల్స్ మూయమని, మెస్సులను యధావిధిగా కొనసాగిస్తామని, మీ నిరసనలకు విద్యార్థి సంఘ నాయకుల్ని ప్రభుత్వం దగ్గరికి తీసుకెళ్లి చర్చిస్తామని హామీ ఇవ్వడంతో ప్రధాన గేటు ద్వారాలను తెరిచారు. గత 13 సంవత్సరాలుగా పశు వైద్య విద్యార్థులకు ఉన్నటువంటి 7, ఉపకార వేతనాన్ని పెరిగిన కాస్మోటిక్ ఛార్జీలకు అనుగుణంగా పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకొని అమలు చేయాలని పశువైద్య విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.